బుధవారం 03-7-2024

# ముందడుగు

దినపత్రిక

సంపుటి: 1, సంచిక: 383, పేజీలు: 4 | ₹6

EPAPER.MUNDADUGU.COM

SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD | KARIMNAGAR | WARANGAL | JAGITYAL | KHAMMAM | NALGONDA | MAHABOOBNAGAR | NIZAMABAD

మీ ప్రాంతంలో జరిగే ఏలాంటి సమస్య ఐనా ముందడుగు దృష్టికి తీసుకురండి.. సమస్య పరిష్కారానికి ప్రయత్నం చేద్దాం. మీ ప్రాంతంలో మీరు ముందడుగు పౌర పాత్రికేయుడిగా పనిచేయొచ్చు.. మీ సమస్యలపై స్పందించండి..

Mundadugu whatsapp: 9491114616

email: mundadugu111@gmail.com



50 పేద జంటలకు సామూహిక వివాహాలు

వివరాలు 2లో



213 మంది ఖైదీల విడుదలకు జీవో జారీ

వివరాలు 3లో



MRP ధర కంటే ఎక్కువ వసూలు చేస్తున్నారా..

వివరాలు 4లో



ఆమెను స్ఫూర్తిగా తీసుకుంటా!

వివరాలు 5లో

## శివారాధన కార్యక్రమంలో భారీ తొక్కిసలాట

- 116కు చేరిన మృతుల సంఖ్య
- మృతుల్లో మహిళలు, చిన్నారులే అధికం
- తొక్కిసలాట ఘటనపై స్పందించిన యూపీ సీఎం యోగి

ముందడుగు ఉత్తరప్రదేశ్: ఉత్తర్‌ప్రదేశ్‌లోని హాథ్రస్ జిల్లాలో జరిగిన ఆధ్యాత్మిక శివారాధన కార్యక్రమంలో భారీ తొక్కిసలాట జరిగింది. ఈ ఘటనలో మృతుల సంఖ్య 116కు చేరింది. పలువురు పలు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని యూపీ పోలీసులు పేర్కొన్నారు. రతిభాన్పూర్‌లో మంగళవారం మధ్యాహ్నం భోలా బాబా ఆధ్వర్యంలో శివ ఆరాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భక్తులు తమ కుటుంబ సభ్యులతో కలిసి తండోపతండాలుగా తరలివచ్చారు. ఆరాధన కార్యక్రమం ముగియగానే.. బయటకు వచ్చేందుకు భక్తులు పరుగులు పెట్టారు. అక్కడ చిన్న గేటు ఉండడంతో ఒకేసారి అందరూ పరుగెత్తడంతో తొక్కిసలాట జరిగింది.



ఈ తొక్కిసలాటలో మొదట 27 మందికి పైగా మరణించారు. మొత్తంగా మంగళవారం రాత్రి వరకు ఆ సంఖ్య 116కు చేరుకుంది. మృతుల్లో మహిళలు, చిన్నారులే అధికంగా ఉన్నారు. ఎటా ప్రభుత్వ ఆస్పత్రితో పాటు ఇతర ఆస్పత్రుల్లో బాధితులు చికిత్స పొందుతున్నారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు.

ప్రత్యక్ష సాక్షి మాట్లాడుతూ.. శివ ఆరాధన కార్యక్రమానికి భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. బయటకు వచ్చేందుకు దారి ఒక్కటే ఉంది. అది కూడా చిన్న గేటు. దాంట్లో నుంచి బయటకు వచ్చేందుకు ఒకేసారి అందరూ ప్రయత్నించారు. గేటు బయటనే బైక్‌లు పార్క్ చేయడం మరింత ఇబ్బందిగా మారింది. మొత్తంగా దారి మూసుకుపోయింది. దీంతో తొక్కిసలాట జరిగింది అని సదరు వ్యక్తి తెలిపాడు.

ఈ తొక్కిసలాట ఘటనపై ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్ స్పందించారు. రతిభాన్పూర్‌లో సహాయక చర్యలు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ ప్రమాద ఘటనపై ఉన్నతస్థాయి కమిటీ ఏర్పాటు చేసి, వీలైనంత త్వరగా ప్రభుత్వానికి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. అయితే ఈ కార్యక్రమానికి పోలీసుల నుంచి ఎలాంటి అనుమతి తీసుకోలేదని ప్రాథమిక విచారణలో తేలింది.

## నీట్ లీక్ నిందితులను కఠినంగా శిక్షిస్తాం

- విద్యా వ్యవస్థను బలోపేతం చేద్దాం
- విపక్షాలకు మళ్లీ ఘోర ఓటమి తప్పలేదు
- ప్రధానమంత్రి నరేంద్ర మోడీ వ్యాఖ్యలు



ముందడుగు జాతీయం: నీట్ ప్రశ్నాపత్రం లీక్ నిందితులను కఠినంగా శిక్షిస్తామని, పోటీ పరీక్షల్లో ప్రశ్నా పత్రాల లీకేజీల విషయాన్ని అత్యంత తీవ్రంగా పరిగణిస్తున్నామని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పేర్కొన్నారు. విద్యా వ్యవస్థను బలోపేతం చేసే చర్యలు తీసుకుంటామన్నారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు మిగతా 2లో

## ప్రధాని మోడీకి రాహుల్ గాంధీ లేఖ

నీట్ వ్యవహారంపై చర్చ జరిగేలా చూడండి



ముందడుగు జాతీయం: ప్రధాని నరేంద్ర మోడీకి ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ లేఖ రాశారు. నీట్ వ్యవహారంపై లోక్‌సభలో బుధవారం చర్చ జరిగేలా చూడాలని కోరారు. విద్యార్థుల ప్రయోజనాల మిగతా 2లో

ముందడుగు
బుధవారం, 03-7-2024, హైదరాబాద్

# 50 పేద జంటలకు సామూహిక వివాహాలు

## భారీ కానుకలు అందజేసిన అంబానీ కుటుంబం

ముందడుగు జాతీయం: రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేశ్ అంబానీ తన కుమారుడి వివాహ వేడుకల్లో భాగంగా మంగళవారం పేద కుటుంబాలకు చెందిన 50 జంటలకు సామూహిక పెళ్లిళ్లు జరిపించారు. ముంబయి సమీపంలోని రిలయన్స్ కార్పొరేట్ పార్క్ ఇందుకు వేదికైంది. దీనికి రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేశ్ అంబానీ, ఆయన సతీమణి నీతా అంబానీ, పెద్ద కుమారుడు ఆకాశ్, కోడలు శ్లోక, కుమార్తె ఈశా, అల్లుడు ఆనంద్ పిరమల్ హాజరయ్యారు. అలాగే కొత్త జంటల తరపున కొందరు బంధువులు ఈ కార్యక్రమంలో భాగమయ్యారు.



రాబోయే రోజుల్లో ఇలా మరిన్ని వివాహాలు జరిపిస్తామని ముకేశ్ కుటుంబం పేర్కొంది. ఈ సందర్భంగా కొత్త జంటలకు భారీగా కానుకలు అందాయి. బంగారు మంగళసూత్రం, వివాహ ఉంగరాలు, ముక్కుపుడక, వెండి మెట్టెలు, పట్టీలు అందించారు. అలాగే పెళ్లి కుమార్తెకు స్త్రీ ధనం కింద రూ.1.01 లక్షల చెక్ అందించారు. అంతేగాకుండా ఒక ఏడాదికి సరిపడా సరుకులు అందజేశారు. గ్యాస్ స్టవ్, మిక్సీ, ఫ్యాన్, పరుపులు, దిండ్లు, గిన్నెలు కూడా ఉన్నాయని జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. అతిథులందరికీ భారీ విందు ఏర్పాటుచేశారు. నూతన దంపతులు ముకేశ్-నీతా వద్ద ఆశీర్వాదం తీసుకున్న దృశ్యాలు వైరల్‌గా మారాయి.

# ప్రధాని మోడీకి రాహుల్ గాంధీ లేఖ

మొదటిపేజీ తరువాయి


దృష్ట్యా నీట్ అంశంపై చర్చకు ప్రధాని మోడీ నాయకత్వం వహిస్తే సముచితంగా ఉంటుందని విశ్వసిస్తున్నట్లు లేఖలో పేర్కొన్నారు. జూన్ 28న నీట్ వ్యవహారంపై పార్లమెంటు ఉభయ సభల్లో చర్చించాలని విపక్షాలు కోరగా.. అందుకు నిరాకరించారన్నారు. సోమవారం కూడా ఇదే అంశంపై మళ్లీ చర్చకు అడిగిన విషయాన్ని ఈ సందర్భంగా రాహుల్ గుర్తు చేశారు. దీనిపై ప్రభుత్వంతో చర్చిస్తామని స్పీకర్ విపక్షాలకు హామీ ఇచ్చారని లేఖలో పేర్కొన్నారు.

నీట్ ఆశావహుల పరిస్థితిపై ఆందోళన వ్యక్తం చేసిన రాహుల్.. ఈ వ్యవహారంపై నిర్మాణాత్మకంగా అడుగులు వేయడమే లక్ష్యంగా ముందుకెళ్లాల్సిన అవసరాన్ని గుర్తు చేశారు. నీట్ పరీక్షపై తక్షణమే దృష్టిపెట్టాల్సిన అవసరం ఉందని, ఎందుకంటే ఇది మన ఉన్నత విద్యా వ్యవస్థలో కుళ్లును బహిర్గతం చేసిందన్నారు. గత ఏడేళ్లలో 70కి పైగా పేపర్ లీకేజీలు జరిగాయని, వీటితో 2కోట్ల మంది విద్యార్థులపై ప్రభావం పడిందని పేర్కొన్నారు. లక్షలాది మంది విద్యార్థులు, వారి కుటుంబాలు ఈ అంశాన్ని పరిష్కరించేందుకు ప్రజా ప్రతినిధులు ధైర్యంగా, నిర్ణయాత్మకమైన చర్యలు తీసుకుంటారని మనవైపే చూస్తున్నారని తెలిపారు. అందువల్ల పార్లమెంట్‌లో జరిగే చర్చ విద్యార్థుల్లో విశ్వాసాన్ని పెంపొందించేందుకు తొలి అడుగుగా ఉండాలన్నారు. నీట్ అంశం తీవ్రత దృష్ట్యా బుధవారం లోక్‌సభలో చర్చకు సులభతరం చేసేలా చూడాలని అభ్యర్థిస్తున్నట్లు లేఖలో తెలిపారు.

# దట్టమైన అడవిలోకి తీసుకెళ్లిన గూగుల్ మ్యాప్

## ఆకలి దప్పికలతో 11 గంటల పాటు నరకం

ముందడుగు ఒడిశా: ఆలయాన్ని సందర్శించేందుకు వెళ్లిన కొందరు విద్యార్థులు గూగుల్ మ్యాప్స్‌ను నమ్ముకొని దారి తప్పి దట్టమైన అడవిలో చిక్కుకున్నారు. ఆకలి దప్పికలతో 11 గంటల పాటు నరకం అనుభవించారు. ఒడిశా కటక్‌లోని ఓ ప్రైవేట్ కళాశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు సప్తసజ్య ఆలయానికి జూన్ 30న వెళ్లారు. ద్విచక్రవాహనాలపై అక్కడికి చేరుకున్న వారు కొండపై ఉన్న విష్ణుబాబా మఠానికి ఉదయం 11 గంటలకు చేరుకున్నారు. గూగుల్ మ్యాప్స్ సహాయంతో తిరుగు పయనమైన క్రమంలో వారు దట్టమైన అడవిలో చిక్కుకుపోయారు. అలసట, ఆకలి, దప్పికలతో చాలా సేపు సహాయం కోసం ప్రయత్నించారు. అలా 11 గంటల పాటు అడవిలో



బిక్కుబిక్కుమంటూ గడిపారు. చివరికి పోలీసులను సంప్రదించగలిగారు. అప్రమత్తమైన రెస్క్యూ బృందం అడవిలో గాలింపులు చేపట్టి విద్యార్థులను రక్షించింది. "ఆలయాన్ని సందర్శించిన తర్వాత గూగుల్ మ్యాప్స్ ద్వారా మేమున్న చోటుకు కొంత దూరంలో అందమైన ప్రదేశం ఉందని తెలుసుకున్నాం. అక్కడికి చేరుకునే ప్రయత్నంలో అడవిలో చిక్కుకుపోయాం" బాధితులు పేర్కొన్నారు.

# కూతురి జీవితాన్ని చిదిమేసిన తండ్రి

## తండ్రికి 101 ఏళ్ల జైలు శిక్ష విధించిన కోర్టు



ముందడుగు జాతీయం: కూతురిని కంటికి రెప్పలా కాపాడాల్సిన తండ్రి పదేళ్ల ప్రాయం నుంచే ఆమెపై లైంగిక దాడి చేశాడు. ఆ పైశాచికత్వం బయటపెట్టకూడదని బెదిరించడమే కాకుండా ఆరేళ్ల పాటు మృగంలా ప్రవర్తించాడు. 16 ఏళ్ల వయసులో ఆ బాలిక గర్భం దాల్చడంతో ఈ దారుణం వెలుగులోకి వచ్చింది. కేరళలోని మల్లపురానికి చెందిన స్పెషల్ ఫాస్ట్‌ట్రాక్ కోర్టు దీనిపై తాజాగా తీర్పు వెలువరించింది. కేసు తీవ్రత దృష్ట్యా అతడికి 101 ఏళ్ల జైలు శిక్షతో పాటు యావజ్జీవ కారాగార శిక్షనూ విధించింది. పోక్సో, జువెనైల్ జస్టిస్ యాక్ట్ వంటి చట్టాల కింద గతవారం ఆ వ్యక్తికి కోర్టు శిక్ష వేసింది. ఈ క్రూరమైన నేర ప్రభావం ఆ బాలికపై జీవితాంతం ఉంటుందని తీవ్ర విచారం వ్యక్తం చేసింది. "ఒక తండ్రిగా ఆ చిన్నారిని కాపాడాల్సిన వ్యక్తే.. ఈ దారుణానికి ఒడిగట్టాడు. 16 ఏళ్ల వయసులో ఆమె గర్భం దాల్చేవరకు పైశాచికత్వాన్ని కొనసాగించాడు. దీనిని సాధారణ లైంగిక నేరంగా చూడలేం. నేరానికి పాల్పడిన వ్యక్తి ఆర్థికంగా, విద్యాపరంగా వెనకబడిన కుటుంబం నుంచి వచ్చినప్పటికీ.. అతడిపై ఎలాంటి కనికరం చూపలేం" అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేసింది.

# నీట్ లీక్ నిందితులను కఠినంగా శిక్షిస్తాం

మొదటిపేజీ తరువాయి

తెలిపే తీర్మానం చర్చ సందర్భంగా లోక్‌సభలో ప్రసంగించిన మోడీ.. లీక్ ఘటనపై వేగంగా దర్యాప్తు జరుగుతోందన్నారు.

ఓబీసీ వర్గాలను కాంగ్రెస్.. దొంగలుగా చిత్రీకరిస్తోంది. వీర్ సావర్కర్‌పైనా ఆ పార్టీ నేతలు విమర్శలు చేశారు. భాషలు, వర్గాల మధ్య చిచ్చు పెడుతున్నారు. హిందువులపై దారుణమైన ఆరోపణలు చేస్తున్నారు. ఉగ్రవాదం అనే మాటను ప్రచారం చేస్తున్నారు. వారి మాటలు హిందువుల మనోభావాలను కించపరిచాయి" అని కాంగ్రెస్‌పై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానం చర్చ సందర్భంగా ప్రధాని మోడీ లోక్‌సభలో మాట్లాడారు. ఈ సందర్భంగా విపక్షాలపై విరుచుకుపడ్డారు. ఎన్ని అబద్ధాలు చెప్పినా లోక్‌సభ ఎన్నికల్లో విపక్షాలకు మళ్లీ ఘోర ఓటమి తప్పలేదని.. వారి బాధను అర్థం చేసుకోగలనని ఎద్దేవా చేశారు. ప్రధాని మాట్లాడుతున్నంత సేపు 'మణిపుర్.. మణిపుర్' అంటూ నినాదాలు చేశారు. వారి నిరసన మధ్యే ప్రధాని ప్రసంగాన్ని కొనసాగించారు.

# ఛత్తీస్‌గఢ్ జిల్లాలో భారీ ఎన్‌కౌంటర్

## ఎదురు కాల్పుల్లో 11 మావోయిస్టులు మృతి

ముందడుగు ఛత్తీస్‌గఢ్: ఛత్తీస్‌గఢ్ నారాయణపూర్ జిల్లాలో భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. పోలీసులు, మావోయిస్టుల ఎదురు కాల్పుల్లో 11 మావోయిస్టులు మృతి చెందారు. ఈ విషయాన్ని ఐజీ సుందర్‌రాజ్ వెల్లడించారు. ధనంది-కుర్రేవాయ అటవీ ప్రాంతంలో ఎన్‌కౌంటర్ చోటు చేసుకుందని ఆయన తెలిపారు. ఖోకామెటా పోలీస్‌స్టేషన్ పరిధిలోని అటవీ ప్రాంతంలో మావోయిస్టుల కదలికలు ఉన్నాయన్న సమాచారంతో జిల్లా రిజర్వ్ పోలీసులుతోపాటు స్పెషల్ టాస్క్‌ఫోర్స్, బీఎస్ఎఫ్, ఐటీబీపీ దళాలు సంయుక్తంగా సోమవారం ఆపరేషన్ ప్రారంభించాయని తెలిపారు. గుర్తించిన మావోయిస్టులు కాల్పులకు దిగారని, దీంతో బలగాలు కూడా ఎదురుకాల్పులు జరిపినట్లు వెల్లడించారు. ప్రస్తుతం ఇంకా ఆపరేషన్ కొనసాగుతోందని మృతి చెందిన మావోయిస్టుల సంఖ్య పెరిగే అవకాశముందని సుందర్‌రాజ్ తెలిపారు.



ముందడుగు
బుధవారం, 03-7-2024, హైదరాబాద్

# 213 మంది ఖైదీల విడుదలకు జీవో జారీ

## తెలంగాణ గవర్నర్ కార్యాలయం ఆమోదం

ముందడుగు తెలంగాణ:

తెలంగాణ జైళ్లో సత్ప్రవర్తన కింద ఖైదీల విడుదలకు ప్రభుత్వం జీవో జారీ చేసింది. ప్రభుత్వం రూపొందించిన మార్గదర్శకాలకు గవర్నర్ కార్యాలయం ఆమోదం తెలపడంతో 213 మంది ఖైదీల విడుదల కానున్నారు. వీరిలో 205 మంది జీవిత ఖైదు అనుభవిస్తున్న వారు ఉన్నారు. ఒక్కొక్కరు రూ.50వేల సొంత పూచీకత్తు సమర్పించాలని, 3 నెలలకోసారి జిల్లా ప్రొబేషన్ అధికారి ఎదుట హాజరు కావాలని ఉత్వర్వుల్లో పేర్కొన్నారు. విడుదల కానున్న ఖైదీలందరికీ తప్పనిసరిగా ఉపాధి కల్పించాలని గవర్నర్ కార్యాలయం సూచించినట్లు తెలుస్తోంది. వీరికి జైళ్ల శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పెట్రోల్ బంక్‌లు లాంటి చోట్ల ఉపాధి కల్పించనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జైళ్ల నుంచి విడుదల






కావాల్సిన ఖైదీలను చర్లపల్లి కేంద్ర కారాగారానికి తరలించనున్నారు. వారితో జైళ్ల శాఖ డైరెక్టర్ జనరల్ సౌమ్యమిశ్రా బుధవారం మాట్లాడి.. అభిప్రాయాలు తెలుసుకోనున్నారు.

ఏటా స్వాతంత్ర్య దినోత్సవం, గాంధీ జయంతి లాంటి సందర్భాల్లో సత్ప్రవర్తన కలిగిన ఖైదీలను విడుదల చేస్తుంటారు. అయితే, తెలంగాణ ఏర్పాటు తర్వాత ఇప్పటివరకు రెండుసార్లు మాత్రమే ఇది కార్యరూపం దాల్చింది. 2016లో తొలిసారిగా ఖైదీలను విడుదల చేశారు. రెండోసారి 2020 అక్టోబరు 2న 141 మందిని విడుదల చేశారు. 2022లో 150 మందిని విడుదల చేసేందుకు ప్రతిపాదనలు రూపొందించినా పలు కారణాలతో ఆమోదం లభించలేదు. ఈ ఏడాది జనవరిలోనే విడుదలకు జైళ్ల శాఖ జాబితా తయారు చేసినప్పటికీ తాజాగా మార్గం సుగమమైంది.

# మమతా బెనర్జీపై గవర్నర్ ఘాటు వ్యాఖ్యలు

## ఎంబీ కాక్‌టెయిల్' బెంగాల్‌ను దెబ్బతీస్తోందని వెల్లడి

ముందడుగు పశ్చిమబెంగాల్:

పశ్చిమబెంగాల్ గవర్నర్ ఆనంద్ బోస్, ముఖ్యమంత్రి మమతా బెనర్జీపై ఘాటు వ్యాఖ్యలు చేశారు. 'ఎంబీ కాక్‌టైల్'తో రాష్ట్రంలో శాంతిభద్రతలు కొరవడుతున్నాయని విమర్శించారు. తొలుత బాధితురాలని పరామర్శించేందుకు ఆమె ఇంటికి వెళ్లాలని నిర్ణయించిన గవర్నర్.. పోలీసుల సూచన మేరకు ఆగిపోయారు. బాధితురాలు ప్రస్తుతం ఒంటరిగా ఉండాలని కోరుకుంటోందని అధికారులు తెలియజేయడంతో ప్రయాణాన్ని వాయిదా వేసుకున్నారు. " బాధిత మహిళ ఎవరినీ కలవకుండా ఒంటరిగా ఉండాలని కోరుకుంటున్నట్లు సమాచారం అందింది. ఆమె నిర్ణయాన్ని గౌరవించి నేను వెళ్లలేదు. ఆమె రాజ్‌భవన్‌కు ఎప్పుడైనా రావొచ్చు. లేదంటే నేను వెళ్లేందుకైనా సిద్ధమే" అని





గవర్నర్ మీడియాకు తెలిపారు. ఇటీవల చోటు చేసుకున్న హింసాత్మక ఘటనల బాధితులను చాలా మందిని కలిశానని, వారితో మాట్లాడినప్పుడు వారు తమ బాధలు తనతో పంచుకున్నారని గవర్నర్ తెలిపారు. వారందరి మాటలు విన్న తర్వాత సీఎం మమతా బెనర్జీ సారథ్యంలో నడుస్తున్న ఈ రాష్ట్రంలో మహిళలకు భద్రత లేదని అర్థమైందన్నారు. రాష్ట్రంలోని చాలా ప్రాంతాల్లో దుర్భర పరిస్థితులు ఉన్నాయని చెప్పారు. ధనబలం, రాజకీయ బలం, ప్రభుత్వం అండతో సంఘ వ్యతిరేక శక్తులు పేట్రేగిపోతున్నాయని విమర్శించారు. మమతా బెనర్జీని ఉద్దేశిస్తూ.. 'ఎంబీ కాక్‌టెయిల్' బెంగాల్ పరిస్థితిని దెబ్బతీస్తోంది. హింస ఆనవాయితీగా మారింది. దీనికి హోం మంత్రి, పోలీసులు, రాష్ట్ర ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలి. పౌరుల సంరక్షణ బాధ్యత ప్రభుత్వానిదేనన్న సంగతి పాలకులు గుర్తుంచుకోవాలి" అని విమర్శించారు.

# నీట్ అవకతవకలపై 26 పిటిషన్లు

## జులై 8న సుప్రీంకోర్టులో విచారణ

ముందడుగు ఢిల్లీ:

దేశంలో నీట్-యూజీ 2024 పరీక్షలో అవకతవకలు, లీకేజీలపై దేశవ్యాప్తంగా తీవ్ర దుమారం కొనసాగుతోంది. ఆ పరీక్షను రద్దు చేసి మళ్లీ కొత్తగా నిర్వహించాలనే డిమాండ్లు వినిపిస్తున్నాయి. ఇదే అంశంపై సుప్రీంకోర్టులో అనేక పిటిషన్లు దాఖలయ్యాయి. మొత్తంగా 26 పిటిషన్లను భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం జులై 8న విచారణ చేపట్టేందుకు సిద్ధమైంది. ఇందుకు సంబంధించి సుప్రీం కోర్టు వెబ్‌సైట్‌లో తాజా అప్‌డేట్ వచ్చింది. నీట్-యూజీ పేపర్ లీకేజీ ఆరోపణలు రావడంతో కొత్తగా పరీక్ష నిర్వహించాలని జూన్ 11న సుప్రీంకోర్టులో ఓ పిటిషన్ దాఖలైంది. పరిశీలించిన సుప్రీం ధర్మాసనం.. పరీక్ష పవిత్రత దెబ్బతిందని వ్యాఖ్యానించింది. అయితే, కౌన్సెలింగ్‌ను నిలిపివేసేందుకు నిరాకరించిన న్యాయస్థానం..





ఈ వ్యవహారంపై స్పందన తెలియజేయాలని కేంద్ర ప్రభుత్వంతోపాటు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీను ఆదేశించింది. అభ్యర్థుల్లో 1563 మందికి గ్రేస్ మార్కులు కలపడం, నీట్‌ను రద్దు చేయడం, ఓఎంఆర్ షీట్లు అందకపోవడం, న్యాయస్థానం పర్యవేక్షణలో దర్యాప్తు వంటి అంశాలతో అనేక పిటిషన్లు దాఖలయ్యాయి. వీటన్నింటిని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలో జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం విచారించనుంది. మే 5న దేశవ్యాప్తంగా 4750 కేంద్రాల్లో నిర్వహించిన నీట్-యూజీ 2024 పరీక్షకు దాదాపు 24 లక్షల మంది అభ్యర్థులు హాజరయ్యారు. వీటి ఫలితాలను జూన్ 14న వెల్లడించాలని ఎన్‌టీఏ భావించినప్పటికీ.. ముందస్తుగానే జవాబు పత్రాల మూల్యాంకనం ముగియడంతో జూన్ 4నే ఫలితాలు వెల్లడించింది. అయితే, పరీక్షలో అవకతవకలు, పేపర్ లీకేజీ ఆరోపణలు రావడం దేశవ్యాప్తంగా ఆందోళనలకు కారణమయ్యింది. ఈ వ్యవహారంపై కేసు నమోదు చేసిన సీబీఐ.. బిహార్‌లో ఇప్పటికే పలువురు అనుమానితులను అరెస్టు చేసింది.

# జైలులో దేవుడిని ప్రార్థిస్తున్న ఖైదీ

- మరణశిక్షను జీవితఖైదుగా మార్చిన హైకోర్టు
- ఆరేళ్ల బాలికపై అత్యాచారం చేసిన నిందితుడు

ముందడుగు ఒడిశా:

ఆరేళ్ల బాలికపై అత్యాచారం కేసులో దోషిగా తేలిన ఎస్‌కే ఆసిఫ్ అలీకి ఒడిశాలోని జగత్‌సింగ్‌పుర్‌లో ఉన్న పోక్సో కోర్టు విధించిన మరణశిక్షను హైకోర్టు జీవిత ఖైదుగా మార్చింది. ఒడిశా హైకోర్టు తాజాగా సంచలన తీర్పు వెలువరించింది. దీనికి సంబంధించి జూన్ 27న 106 పేజీల తీర్పును హైకోర్టు ఇచ్చింది. తీర్పు ఇచ్చే క్రమంలో ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. "ఈ కేసులో దోషిగా తేలిన ఆసిఫ్ అలీ రోజూ దేవుణ్ని ప్రార్థిస్తున్నాడు. అతడు దేవుడి ముందు లొంగిపోయాడు. తాను చేసిన



నేరాన్ని అంగీకరించడానికి సిద్ధంగా ఉన్నాడు. అందుకే అతడికి విధించిన మరణశిక్షను జీవితఖైదుగా మారుస్తున్నాం" అని తీర్పు ఇచ్చే సందర్భంగా హైకోర్టు వ్యాఖ్యానించింది. బాధిత బాలిక కుటుంబానికి రూ.1.50 లక్షల పరిహారాన్ని ఇవ్వాలని పోక్సో కోర్టు ఆదేశించగా.. దాన్ని సవరించిన న్యాయస్థానం రూ.10 లక్షలు అందించాలంటూ ఆదేశాలు జారీ చేసింది.

ముందడుగు
బుధవారం, 03-7-2024, హైదరాబాద్

## బాయ్‌ఫ్రెండ్ పురుషాంగాన్ని కోసేసిన మహిళ డాక్టర్

### పెళ్లికి నిరాకరించడని కోపంతోనే అఘాయిత్యం



ముందడుగు బీహార్:
ఓ మహిళా డాక్టర్ తన బాయ్‌ఫ్రెండ్ పురుషాంగాన్ని కోసేసింది. బీహార్ సరన్ జిల్లాలో ఈ ఘటన జరిగింది. ఆత్మహత్యా యత్నం కేసులో ఆ మహిళా డాక్టర్‌ను పోలీసులు అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. బాధిత వ్యక్తి మధురా బ్లాక్‌లోని వార్డు నెంబర్ 12 కౌన్సిలర్. ప్రస్తుతం అతన్ని పాట్నా మెడికల్ కాలేజీలో చికిత్స కోసం చేర్పించారు. గత అయిదేళ్ల నుంచి కౌన్సిలర్‌తో ఆ లేడీ డాక్టర్ రిలేషన్‌లో ఉన్నది. ఈ విషయాన్ని ఆమె కూడా అంగీకరించింది. అయితే పెళ్లి చేసుకునేందుకు ఆ వ్యక్తి నిరాకరించడంతో.. ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు తెలుస్తోంది. రిజిస్టర్ మ్యారేజ్ చేసుకునేందుకు కూడా లేడీ డాక్టర్ సిద్ధమైంది. పెళ్లి కోసం ఆమె కోర్టుకు వెళ్లింది. కానీ బాధిత వ్యక్తి మాత్రం రాలేకపోయాడు.

బాయ్‌ఫ్రెండ్ వ్యవహారంపై విరక్తి చెందిన ఆ డాక్టర్.. తన ఇంటికి అతన్ని పిలిచింది. ఇంటికి వచ్చిన ఆ కౌన్సిలర్ పురుషాంగాన్ని కట్ చేసింది లేడీ డాక్టర్. అయితే కౌన్సిలర్ అరుపులు విన్న స్థానికులు .. జరిగిన ఘటన గురించి పోలీసులకు తెలిపారు. బెడ్‌పై రక్తపు మడుగులో ఉన్న అతన్ని వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లారు. నిందితురాలు అవివాహిత. ఆమె వయసు 25 ఏళ్లు. హాజిపూర్ ఆమె స్వస్థలం. మధౌరాలో ఆమె ప్రాక్టీసు చేస్తోంది. బాధిత వ్యక్తి కూడా అవివాహితుడే అని మధౌరా పోలీసు స్టేషన్ అధికారి తెలిపారు. నిందితురాలని అరెస్టు చేశామని, తదుపరి విచారణ కొనసాగిస్తున్నామని వెల్లడించారు.

## కాశ్మీర్ పాఠశాలలకు వేసవి సెలవులు

### కాశ్మీర్ లోయలో పెరిగిన ఉష్ణోగ్రతలు



ముందడుగు కాశ్మీర్:
కాశ్మీర్ లోయలోని పాఠశాలలకు వేసవి సెలవులు ఇచ్చారు. లోయలో ఉష్ణోగ్రతలు పెరుగుతుండడంతో అధికారులు వేసవి సెలవులు ప్రకటించారు. ఈ నెల 8 నుంచి సీనియర్ సెకండరీ స్థాయి వరకు అన్ని పాఠశాలలకు 10 రోజులు సెలవులు ప్రకటించినట్టు అధికారులు తెలిపారు. ఈ మేరకు ఆదివారం అర్ధరాత్రి విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసినట్టు చెప్పారు. కాశ్మీర్ డివిజన్‌లో ఉన్న అన్ని ప్రభుత్వ, గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలలు ఈ నెల 8 నుంచి 17వ తేదీ వరకు వేసవి సెలవులు పాటించాలని, అవసరమైతే విద్యార్థులకు ఆన్‌లైన్ మోడ్‌లో తరగతులు బోధించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ వేసవిలో కాశ్మీర్ లోయలో సాధారణ ఉష్ణోగ్రత కంటే ఎక్కువగా నమోదైందని భారత వాతావరణ శాఖ తెలిపింది.

# MRP ధర కంటే ఎక్కువ వసూలు చేస్తున్నారా..

- ఎక్కువ ధర వసూలు చేస్తే జరిమానాలు, శిక్షలు
- ఎక్కడ, ఎవరికి ఫిర్యాదు చేయాలో తెలుసుకొండి
- ఆన్‌లైన్‌లో సైతం ఫిర్యాదు చేసే అవకాశం ఉంది



ముందడుగు ప్రత్యేకం:
మనం ఏదైనా వస్తువు కొనుగోలు చేస్తున్నప్పుడు వ్యాపారులు ఒక్కోసారి ఎంఆర్పీ ధర కంటే ఎక్కువ వసూలు చేస్తారు. దీనివల్ల వినియోగదారులు నష్టపోతారు. అయితే భారత ప్రభుత్వ చట్టాల ప్రకారం వ్యాపారి ఎక్కువగా వసూలు చేస్తే, వారి నుంచి డబ్బు తిరిగి పొందవచ్చు. మాగ్జిమం రిటైల్ ప్రైస్ అనేది ఒక వస్తువు లేదా సేవ కోసం చిల్లర వ్యాపారి చట్టబద్ధంగా ఛార్జ్ చేయగల గరిష్ఠ మొత్తం. ఈ ధరను తయారీదారులు లేదా విక్రేతలు నిర్ణయిస్తారు. వీరు ఉత్పత్తి ఖర్చులు, మార్కెటింగ్ కాస్ట్స్ , ప్రాఫిట్ మార్జిన్‌ను పరిగణనలోకి తీసుకుని ఎంఆర్పీని నిర్ణయిస్తారు. ఎంఆర్పీని సాధారణంగా ప్రాడక్ట్ లేబుల్ లేదా ప్యాకేజింగ్‌పై ప్రింట్ చేస్తారు. ఇందులోనే అన్ని ట్యాక్సెస్ ఇంక్లూడ్ చేస్తారు.

### ఎక్కువ ధర వసూలు చేస్తే?

భారతదేశంలో 2009 లీగల్ మెట్రాలజీ చట్టం ప్యాక్ చేసిన వస్తువుల అమ్మకాలను నియంత్రిస్తుంది, చట్ట ప్రకారం, ప్రొడక్ట్ లేబుళ్లపై లేదా ప్యాకేజింగ్‌పై ఎంఆర్పీ స్పష్టంగా ప్రింట్ చేయడం తప్పనిసరి. MRP కంటే ఎక్కువ ధరకు ఉత్పత్తులను విక్రయించడం చట్టవిరుద్ధం, అలా చేసే వారికి జరిమానాలు, ఇతర శిక్షలు విధిస్తారు. కన్జ్యూమర్ గూడ్స్ (మాండేటరీ ప్రింటింగ్ ఆఫ్ కాస్ట్ ఆఫ్ ప్రొడక్షన్ అండ్ మాగ్జిమం రిటైల్ ప్రైస్) యాక్ట్ 2006 ప్రకారం, ప్రొడక్ట్ ప్యాకేజింగ్‌పై సూచించిన MRP కంటే ఎక్కువ ధరను వ్యాపారులు వసూలు చేయలేరు.

### ప్రశ్నించడం ముఖ్యం

ఎందుకు ఎక్కువ ధర వసూలు చేస్తున్నారో దుకాణదారుడిని అడగవచ్చు. బిల్లును చూపించి, MRP ధరను సూచించవచ్చు. చాలా సందర్భాలలో, దుకాణదారులు తప్పును గుర్తించి సరైన ధర వసూలు చేస్తారు. దుకాణదారుడు ఎక్కువగానే వసూలు చేస్తా అని మొండిగా వ్యవహరిస్తే రాష్ట్రంలోని సంబంధిత లీగల్ మెట్రాలజీ డిపార్ట్‌మెంట్‌కు ఫిర్యాదు చేయవచ్చు.



### ఎక్కడ, ఎవరికి ఫిర్యాదు చేయాలి?

నేషనల్ కన్జ్యూమర్ హెల్ప్‌లైన్‌ను సంప్రదించడానికి టోల్-ఫ్రీ నెంబర్ 1800-11-4000 లేదా 1915కు కాల్ చేయవచ్చు. SMS ద్వారా 8800001915కు ఫిర్యాదు చేయవచ్చు. NCH యాప్ (https://play.google.com/store/apps/details?id=mount.talent.mtcdev02.udaan) లేదా ఉమాంగ్ యాప్ (https://play.google.com/store/apps/details?id=in.gov.umang.negd.g2c) ద్వారా కూడా ఫిర్యాదు చేయవచ్చు. ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేయడానికి https://consumerhelpline.gov.in/ విజిట్ చేయాలి. ముందుగా వన్-టైమ్ రిజిస్ట్రేషన్ చేసుకోవడం తప్పనిసరి. అందుకు https://consumerhelpline.gov.in వెబ్‌సైట్‌కు వెళ్లి, లాగిన్ లింక్‌పై క్లిక్ చేసి, అవసరమైన వివరాలను ఎంటర్ చేసి, ఈ-మెయిల్ ద్వారా వెరిఫికేషన్ పూర్తి చేయాలి. అలా యూజర్ ఐడీ, పాస్‌వర్డ్ పొందవచ్చు. నేషనల్ కన్స్యూమర్ హెల్ప్‌లైన్ అనేది ఒక ప్రీ-లిటిగేషన్ స్టేజ్ మాత్రమే అని గమనించాలి. ఈ స్టేజ్‌లో సంబంధిత అధికారులు వ్యాపారులను సంప్రదించడం ద్వారా ఫిర్యాదులను పరిష్కరించడానికి ప్రయత్నిస్తారు. వినియోగదారు సంతృప్తి చెందకపోతే, వారు తగిన కన్జ్యూమర్ కమిషన్ ద్వారా పరిహారం కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. వారికి జాతీయ వినియోగదారుల వివాదాల పరిష్కార సంఘం వెబ్‌సైట్, రాష్ట్ర కమిషన్, జిల్లా కమిషన్ అందుబాటులో ఉంటాయి. నిబంధనలను ఉల్లంఘించిన దుకాణదారుడిపై జరిమానా విధించవచ్చు లేదా శిక్షించవచ్చు, వినియోగదారుడు అధికంగా వసూలు చేసిన మొత్తానికి నష్టపరిహారం పొందే అవకాశం కూడా ఉంటుంది. MRP అనేది గరిష్ట ధర కానీ స్థిరమైన ధర కాదు. ప్రజలను ఆకర్షించడానికి చిల్లర వ్యాపారులు MRP కంటే తక్కువ ధరకు ప్రొడక్ట్స్ అమ్ముకోవచ్చు.

ముందడుగు
బుధవారం, 03-7-2024, హైదరాబాద్

# వెబ్‌సైట్‌లోనే సీఎం సహాయ నిధి దరఖాస్తులు

## ఈ నెల 15 తర్వాత దరఖాస్తులు స్వీకరణ

ముందడుగు తెలంగాణ: తెలంగాణ ముఖ్యమంత్రి సహాయ నిధి దరఖాస్తులను ఇకపై ఆన్‌లైన్‌లో స్వీకరించనున్నారు. ఈ సీఎం ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నారు. సెంటర్ ఫర్‌గుడ్ గవర్నెన్స్ ఆధ్వర్యంలో వెబ్‌సైట్ రూపొందించారు. సచివాలయంలో సీఎం రేవంత్ వెబ్‌సైట్‌ని మంగళవారం సాయంత్రం ప్రారంభించారు. ఇకపై సీఎం సహాయ నిధి దరఖాస్తులను వెబ్‌సైట్‌లోనే పూరించాల్సి ఉంటుంది. సీఎంఆర్‌ఎఫ్ కోసం తమ వద్దకు వచ్చే వారి వివరాలు తీసుకుని ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు తమ సిఫారు లేఖను జతచేసి అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది.



అప్లికేషన్‌లో సంబంధింత దరఖాస్తుదారుల బ్యాంక్ అకౌంట్ నంబర్ తప్పనిసరిగా ఇవ్వాల్సి ఉంటుంది. అప్‌లోడ్ చేసిన తర్వాత సీఎంఆర్‌ఎఫ్‌కు సంబంధించిన ఒక కోడ్‌ని ఇస్తారు. ఆ కోడ్ ఆధారంగా ఒరిజినల్ మెడికల్ బిల్లులను సచివాలయంలో అందజేయాల్సి ఉంటుంది. ఆన్‌లైన్ ద్వారా అప్లికేషన్‌ను సంబంధిత ఆసుపత్రులకు పంపి నిర్ధారించుకుంటారు. వివరాలు అన్నిసరిగా ఉంటే అప్లికేషన్‌ను ఆమోదించి చెక్ సిద్ధం చేస్తారు. చెక్‌పై తప్పనిసరిగా దరఖాస్తుదారుడి అకౌంట్ నెంబర్‌ను ప్రింట్ చేస్తారు. ఆ తర్వాత ప్రజాప్రతినిధులు చెక్‌లను స్వయంగా దరఖాస్తుదారులకు అందజేస్తారు.

ఈ నెల 15 తర్వాత సీఎంఆర్‌ఎఫ్ దరఖాస్తులను ఆన్‌లైన్ ద్వారా మాత్రమే స్వీకరిస్తారు. సీఎంఆర్‌ఎఫ్ కోసం cmrf.telangana.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తులు చేసుకోవాల్సి ఉంటుంది.




# నిరుద్యోగుల కోసం విద్యార్థుల రాజకీయ పార్టీ

## కార్యాచరణ రూపొందించాలని డిమాండ్


ముందడుగు హైదరాబాద్: నిరుద్యోగుల డిమాండ్స్ పై కార్యాచరణ రూపొందించి వారి యొక్క సమస్యలపై సమీక్షించాలని తెలంగాణ రాష్ట్ర విద్యార్థుల రాజకీయ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు యెచ్చు సునీల్ డిమాండ్ చేశారు. గ్రూప్ 1-1:100 నిష్పత్తి, గ్రూప్ 2 & 3 పోస్టుల పెంపు, డీఎస్సీ పెంపు, వాయిదా, జీవో నెంబర్ 46 పరిష్కారం తగుపై ఉన్న డిమాండ్స్ యొక్క కాంగ్రెస్ ప్రభుత్వ దృష్టికి సారించే యోచనలో భాగంగా ఆశోక్ నగర్ చౌరస్తాలో మంగళవారం విద్యార్థుల రాజకీయ పార్టీ నాయకులు ధర్నా చేపట్టి నిరుద్యోగులకు మద్దతు ఇచ్చారు. ప్రభుత్వం నిరుద్యోగుల కాళ్ల కిందకి వచ్చేవరకు ఈ పోరాటాన్ని రాష్ట్రవ్యాప్తంగా విస్తృతం చేస్తూ ప్రభుత్వం పై వేటుపడేలా నిరుద్యోగుల యొక్క ప్రభావం ఏంటో తెలిసేలా రంగాన్ని సిద్ధం చేస్తామని సునీల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల రాజకీయ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు యెచ్చు సునీల్ గారు, విద్యార్థుల రాజకీయ పార్టీ మహిళా అధ్యక్షురాలు సాత్విక రెడ్డి, పాత నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# ఆమెను స్ఫూర్తిగా తీసుకుంటా!

అచ్చ తెలుగు అందం శ్రీలీల అనతికాలంలోనే టాలీవుడ్ అగ్ర కథానాయికల్లో ఒకరిగా ఎదిగింది. గత కొంతకాలంగా ఈ భామ నటించిన చిత్రాలు ఆశించిన స్థాయిలో విజయాలు సాధించలేకపోయినా..యూత్‌లో ఆమెకున్న క్రేజ్ ఏ మాత్రం తగ్గలేదు. ప్రస్తుతం ఈ సొగసరి తమిళ, హిందీ భాషల్లో అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు సిద్ధమవుతున్నది. అక్కడ అవకాశాల కోసం ప్రయత్నాలు ఆరంభించింది. అగ్ర హీరో అజిత్ సరసన 'గుడ్ బ్యాడ్ అగ్లీ' చిత్రం ద్వారా తమిళంలో అరంగేట్రం చేయబోతున్నదనే వార్తలొచ్చాయి. అయితే ఈ విషయాన్ని చిత్ర బృందం అధికారికంగా ప్రకటించాల్సి ఉంది. ఇటీవల చెన్నైలో జరిగిన ఓ ప్రైవేట్ కార్యక్రమానికి హాజరైన శ్రీలీల మీడియాతో పలు ఆసక్తికరమైన విషయాలను పంచుకుంది. తమిళ ఇండస్ట్రీలో ఎంట్రీ కోసం ఆతృతగా ఎదురుచూస్తున్నానని తెలిపింది. తమిళంలో తాను నయనతార నటనను బాగా ఇష్టపడతానని, ఆమె తరహాలో లేడీ ఓరియెంటెడ్ సినిమాల్లో నటించాలనుందని తెలిపింది. నటనకు సంబంధించిన చాలా అంశాల్లో తాను నయనతారను స్ఫూర్తిగా తీసుకుంటానని, ప్రస్తుతం తెలుగు, తమిళ భాషల్లో కొన్ని చిత్రాలు చర్చల దశలో ఉన్నాయని శ్రీలీల పేర్కొంది.



# రూల్స్ బ్రేక్ చేసింది!



సినిమా ప్రచార కార్యక్రమాల్లో తారలతో పాటు కొందరు సాంకేతిక నిపుణులు కూడా పాల్గొనడం ఆనవాయితీ. అయితే అగ్ర కథానాయిక నయనతార మాత్రం ఈ నియమాన్ని అస్సలు పాటించదు. గత కొన్నేళ్లుగా ఈ అమ్మడు సినిమా ప్రమోషనల్ ఈవెంట్స్‌కు దూరంగా ఉంటున్న విషయం తెలిసిందే. ప్రాజెక్ట్‌కు ఓకే చేసే ముందే తాను ప్రచారానికి రాననే కండీషన్‌ను పెడుతుందీ భామ. చిరంజీవి, షారుక్‌ఖాన్ వంటి అగ్ర హీరోల సినిమాలైనా సరే.. ప్రమోషన్స్‌కి మాత్రం నయన్ రాదు. అయితే.. తాజాగా ఈ రూల్‌ని బ్రేక్ చేసింది నయన్. తమిళ చిత్రం 'నేసిప్పయ' ప్రమోషనల్ ఈవెంట్‌లో ఆమె పాల్గొంది. విష్ణువర్ధన్ దర్శకత్వంలో అదితి శంకర్ ప్రధాన పాత్రలో నటించిన ఈ చిత్రం త్వరలో విడుదలకు సిద్ధమవుతున్నది. ఈ మూవీ ప్రమోషన్‌లో నయనతార పాల్గొనడానికి ఓ కారణం ఉందట. విష్ణువర్ధన్ దర్శకత్వం వహించిన 'బిల్లా' చిత్రంతోనే నయనతార మంచి స్టార్‌డమ్‌ను సంపాదించుకుంది. పైగా దర్శకుడు విష్ణువర్ధన్ తన కుటుంబ సభ్యుడిలాంటివాడని, తన మీద అభిమానంతోనే ప్రమోషనల్ ఈవెంట్‌లో పాల్గొన్నానని నయనతార పేర్కొంది. ఇదిలావుంటే తాజాగా 'మహారాజ'ఫేం మిథిలన్ సామినాథన్ చెప్పిన లేడీ ఓరియెంటెడ్ కథను నయన్ ఓకే చేసిందట. 'మహారాజ'తో విజయాన్ని అందుకున్న మిథిలన్‌తో సినిమా చేస్తుండటం పట్ల నయన్ అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



# ఇప్పుడేకాదు 20ఏళ్ల క్రితం కూడా ఇంతే

'అపూర్వ రాగంగళ్' నుంచి మొదలైన అపూర్వ స్నేహబంధం కమల్‌హాసన్, రజనీకాంత్‌లది. వీరిద్దరిలో కమల్ నటుడిగా సీనియరే అయినా.. కెరీర్ పరంగా బ్రేక్ అందుకుంది మాత్రం ఇద్దరూ దాదాపు ఒకేసారి. వీరిద్దరికీ గాడ్‌ఫాదర్ ఒకరే.. ఆయనే మహాదర్శకుడు కె.బాలచందర్. కెరీర్ తొలినాళ్లలో ఇద్దరూ కలిసి చాలా సినిమాల్లో నటించారు. కాలక్రమేణా నటులుగా ఇద్దరూ చెరోదారి ఎంచుకున్నారు. కమల్ విభిన్నమైన పాత్రలతో దేశం గర్వించదగ్గ మహానటుడిగా ఎదిగితే.. రజనీ మాస్ పాత్రలతో సౌతిండియన్ సూపర్‌స్టార్‌గా అవతరించారు. ఏదేమైనా ఇద్దరూ ఇద్దరే. ఇటీవల తమ స్నేహానుబంధం గురించి కమల్‌హాసన్ ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. 'మేమిద్దరం ఒకే గురువు వద్ద విద్య నేర్చుకున్న శిష్యులం. అప్పుడు ఇప్పుడు ఎప్పుడూ మా మధ్య అసూయకు స్థానంలేదు. పోటీతత్వం మాత్రమే ఉంది. దశాబ్దాల స్నేహం మాది. ఎన్నో సినిమాల్లో కలిసి నటించాం. ఒక దశలో కలిసి నటించకూడదని అనుకున్నాం. ఎందుకంటే నటులుగా మా మార్గాలు మారాయి. కానీ ఎప్పుడూ కూడా ఒకరినొకరం చులకన చేసుకోలేదు. ఇప్పుడు పెద్దవాళ్లం అయ్యాం కనుక ఇలా అంటున్నానని అనుకోవద్దు. 20ఏళ్ల క్రితం కూడా మేం ఇంతే..' అంటూ నవ్వుతూ చెప్పారు కమల్‌హాసన్.